

# మహారాష్ట్రలో అట్రాసిటీ చట్టం నిబంధనల సవరణ

## ఇకపై తక్షణ అరెస్టులు ఉండవు!

### ముందుగా విచారణ.. నేరం రుజువైతేనే చర్యలు

### శాసన మండలిలో మంత్రి సంజయ్ శిర్సాట్ వెల్లడి

**ప్రజానావ, ముంబై:** షెడ్యూల్డ్ కులాలు, తెగలపై జరుగుతున్న అత్యాచారాల నివారణ చట్టం (అట్రాసిటీ చట్టం) దుర్వినియోగం కాకుండా మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అట్రాసిటీ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేసే పద్ధతిని నిలిపివేస్తున్నట్లు సామాజిక న్యాయ శాఖ మంత్రి సంజయ్ శిర్సాట్ ప్రకటించారు. శనివారం మహారాష్ట్ర శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ, చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని తప్పుడు కేసులు నమోదు చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నందున ఈ మార్పులు చేసినట్లు వెల్లడించారు.

#### కొత్త వ్యవస్థ ఎలా పనిచేస్తుంది?

నూతన నిబంధనల ప్రకారం, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. అయితే, గతంలోలాగా 24 గంటల్లోపు అరెస్టు చేయడం జరగదు. ముందుగా ఒక కమిటీ లేదా దర్యాప్తు అధికారి (xూ) ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ జరుపుతారు. దర్యాప్తులో నేరం జరిగినట్లు ఆధారాలు లభిస్తేనే అరెస్టు ప్రక్రియ చేపడతారు. ఒకవేళ విచారణలో ఫిర్యాదు తప్పు అని తేలితే, సెక్షన్ 169 కింద రిపోర్టును కోర్టుకు సమర్పించి సదరు కేసును కొట్టివేస్తారు.

#### తప్పుడు ఫిర్యాదులపై చర్యలకు కసరత్తు


గతంలో వ్యక్తిగత కక్షలతో అట్రాసిటీ చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఎవరికీ అన్యాయం జరగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. కేవలం అరెస్టుల నిలుపుదల మాత్రమే కాకుండా, కావాలని తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో నిబంధనలు తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని శిర్సాట్ తెలిపారు. 1989లో రూపొందించిన ఈ చట్టం సామాజిక రక్షణకు ఉద్దేశించినదని, అది దుర్వినియోగం కాకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

# బాలుడికి లైంగిక వేధింపులు


## వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్

### 'పోక్సో' కింద ఇద్దరు యువకులపై కేసు

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని రత్నగిరి పట్టణంలో మానవత్వం సిగ్గుపడే అత్యంత హేయమైన ఘటన వెలుగుచూసింది. ఒక బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఆ వికృత చర్యను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఇద్దరు యు-వకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజీవాడ ప్రాంతానికి చెందిన జుబైర్ సలీం షేక్, ముస్తకీన్ గద్కరీ అనే ఇద్దరు వ్యక్తులు ఫిబ్రవరి 22న ఒక మైనర్ చిన్నారిపై అసహజ లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితుల బెదిరింపులకు భయపడిన బాధితుడు ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పలేదు. అయితే, నిందితులు తాము చిత్రీకరించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్ అయింది. అనుకోకుండా ఇంటర్నెట్‌లో ఒక వీడియోను చూసిన బాధితుడి తండ్రి, అందులో కనిపిస్తున్నది తన సొంత కొడుకేనని గుర్తించి నిర్ఘాంతపోయాడు. ఆ దారుణ దృశ్యం చూసి గుండె పగిలినంత పనైనప్పటికీ, వెంటనే ధైర్యం తెచ్చుకుని రత్నగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన పోలీసులు, నిందితులు జుబైర్ షేక్, ముస్తకీన్ గద్కరీలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. వీరిపై భారత శిక్షాస్మృతిలోని సంబంధిత సెక్షన్లతో పాటు 'పోక్సో' చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ వీడియోను నిందితులు ఇంకా ఎక్కడైనా ప్రసారం చేశారా అనే కోణంలో పోలీసులు సాంకేతిక దర్యాప్తు జరుపుతున్నారు.



# 11వ ప్యాకేజీ పనులకు 3.19 కోట్లు



- శాశ్వత పరిష్కారం చూపిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- హర్షం వ్యక్తం చేసిన రైతులు, నాయకులు
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజా ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారికి అండగ ఉంటామని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ఎక్స్ రోడ్ లో మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు శనివారం ఘన స్వాగతం పలికారు. కాళేశ్వరం 11వ ప్యాకేజి పరిధిలోని ఎల్ ఎమ్-4, ఎల్ ఎమ్-6 కాల్వ పెండింగ్ పనులకు రూ. 3.19 కోట్లను మంజూరు చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లెల్ల ఎక్స్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ జె టోనీ ఆధ్వర్యంలో కెకె మహేందర్ రెడ్డి కృషి వల్ల మండల రైతులకు శాశ్వత పరిష్కారం చూపనందుకు రైతులు, నాయకులు కలిసి ప్రజా ప్రభుత్వ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నాగేశ్వర్ రావ్, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్ర పటాలకు నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన కాల్వ పనులు ప్రజా ప్రభుత్వంలో ప్రారంభం కాబోతున్నాయని తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ అన్నారు. రాబోయే కాలంలో ప్రజా ప్రభుత్వానికి ప్రజలందరు అండగా ఉండలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, సీనియర్ నాయకులు , మండల రైతులు పాల్గొన్నారు.

# తీసుకున్నది రూ.5 లక్షల అప్పు ఇప్పటి వరకు కట్టింది 31.50 లక్షలు

## ఇంకా రూ.25 లక్షల కోసం యువకుని కిడ్నాప్



**ప్రజానావ, ముంబై:** నిర్మాణరంగ వ్యాపారం కోసం తీసుకున్న కేవలం రూ.5 లక్షల రుణానికి. ఒక యువ సివిల్ ఇంజనీర్ అసలు, వడ్డీతో సహా మొత్తం రూ.31.50 లక్షలు తిరిగి ఇచ్చినప్పటికీ వడ్డీ వ్యాపారులు సంతృప్తి చెందలేదు. ఆ యువకుడిని కిడ్నాప్ చేసి, అతని కుటుంబాన్ని నాశనం చేస్తానని బెదిరించి, అతని రెండున్నర ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఘటనపై పుండలిక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, లఖన్ రాజు సాబుల్ 33, విక్కీ దేవిదాస్ షిండే 33 అనే ఇద్దరు వడ్డీ వ్యాపారులను అరెస్టు చేశారు. కోర్టు వారిని మార్చి 14 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఇంకా ఇద్దరు నిందితులు వెంకటేష్ రాజు ధాగే, ప్రశాంత్ బందు ధాక్నే ఇప్పటికీ పరారీలో ఉండగా పోలీసులు వారికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. పోలీసులిచ్చిన వివరాల ప్రకారం ఛత్రపతి సంభాజీ నగర్ కు చెందిన విశ్వజీత్ తన నిర్మాణ రంగం వ్యాపారం కోసం బిజ్వాడి నివాసులైన లఖన్ సాబుల్, విక్కీ షిండే వద్ద కారంజ్‌ఖేడ్‌లో ఉన్న 2.5 ఎకరాల పొలం తనఖా పెట్టి 5 లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు.

#### అత్తమామలు నగలు అమ్మి..

రూ.5 లక్షల అప్పుకు గాను మొదట రూ.16 లక్షల విజ్వజిత్ చెల్లించాడు.ఇంకా అప్పు తీరిక పోవడంతో, ఆ అప్పు తీర్చడానికి విజ్వజిత్ అత్తగారు ప్రతిభా దేశ్‌ముఖ్ తన నగలు అమ్మి,నిందితులకు రూ.15.5 లక్షల రెండు చెక్కులు ఇచ్చారు. ఈ విధంగా, నిందితులు రూ.5 లక్షలకు బదులుగా ఇప్పటివరకు రూ.31 లక్షల 50 వేలు తీసుకున్నారు. అయినప్పటికీ, నిందితులు తనఖా పెట్టిన భూమిని తిరిగి ఇవ్వడానికి ఇంకా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

#### కిడ్నాప్ చేసి బలవంతంగా భూమి రిజిస్ట్రేషన్..

డిసెంబర్ 5, 2024న, నిందితులు విశ్వజీత్‌ను కిడ్నాప్ చేసి కన్నడకు తీసుకెళ్లారు. అతని వద్ద డబ్బు లేకపోతే, ఆ భూమిని వెంకటేష్ ధాగేకు బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

వారు అతన్ని ఎంఐడిసి చికల్తానా ప్రాంతానికి తీసుకెళ్లి కత్తి తో బెదిరించి కొట్టారు. తన కుటుంబం,తన ప్రాణాలకు భయపడి, విశ్వజీత్ కారంజ్‌ఖేడ్‌లోని తన రెండున్నర ఎకరాల భూమిని వెంకటేష్ ధాగేకు బదిలీ చేశాడు.

#### తీసుకున్న అసలు రుణం: రూ. 5 లక్షలు.

తిరిగి చెల్లింపు: రూ. 31.50 లక్షలు ప్రారంభంలో రూ. 16 లక్షలు, తరువాత రూ. 15.5 లక్షలు.కరంజ్‌ఖేడ్‌లోని రెండున్నర ఎకరాల సాగునీటి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆఖరుకు ఈ వేధింపులతో విసిగిపోయిన దేశ్‌ముఖ్ కుటుంబం చివరకు పుండలిక్ నగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసు కున్న పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ కహర్వాలే ఈ కేసుపై తదుపరి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# ముంబై, విరార్‌లో అక్రమ 'స్పెర్మ్ బ్యాంక్' గుట్టురట్టు




**ప్రజానావ, ముంబై:** కృత్రిమ గర్భధారణ కోసం ఉపయోగించే దాతల స్పెర్మ్ నమూనాలను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నందుకు విరార్ (తూర్పు)లో ఇద్దరు వ్యక్తులపై వైద్య ఆరోగ్య శాఖ కేసు నమోదు చేసింది. వసాయి-విరార్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వైద్య ఆరోగ్య విభాగం అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (నియంత్రణ) చట్టం 2021, సరోగసీ (నియంత్రణ) చట్టం 2021 లను అమలు చేస్తుంది. ఈ విభాగానికి అందిన సమాచారం ప్రకారం, విరార్ (తూర్పు)లోని సబ్‌వే ఎదురుగా ఉన్న ఎన్ పి రోడ్‌లోని పద్మిబాయి టవర్ వద్ద ఉన్న 'జీవదాని సైంటిఫిక్ కంపెనీ'లో గామేట్‌లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ సూర్యవంశీ, అదనపు కమిషనర్ (వైద్య ఆరోగ్యం), డిప్యూటీ కమిషనర్ (వైద్య ఆరోగ్యం) ఆదేశాల తో, వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భక్తి చౌదరి తనిఖీ కోసం ఒక వైద్య బృందాన్ని నియమించారు. మార్చి 9, 2026న, వైద్య బృందం సంబంధిత ప్రాంగణాన్ని తనిఖీ చేసినప్పుడు, 'జీవదాని సైంటిఫిక్ కంపెనీ' అనే ఏజెన్సీ మయూర్ భగవత్ సంఖే, కమలేష్ శంకర్ ఖుట్ యాజమాన్యంలో ఉందని తేలింది. తనిఖీ సమయంలో, దాతల స్పెర్మ్ నమూనాలను క్రయోజెనిక్ కంటైనర్‌లో చట్టవిరుద్ధంగా నిల్వ చేసినట్లు గమనించబడింది. కృత్రిమ గర్భధారణ కోసం ఉపయోగించే మొత్తం 45 స్పెర్మ్ నమూనాలు (స్పెర్మ్ వైల్స్) ఈ కంటైనర్‌లో కనుగొనబడ్డాయి.

#### వైద్యుల డిమాండ్ మేరకు సామాగ్రి

వైద్యులు, ఆసుపత్రులు లేదా ఏజెంట్ల నుండి ఫోన్ ద్వారా డిమాండ్ వచ్చిన తర్వాత ఈ ఏజెన్సీ ద్వారా సంబంధిత వ్యక్తులకు వీర్య నమూనాలను అందిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం, 2021 కింద సంబంధిత స్థలం ఏఆర్టీ బ్యాంక్‌గా నమోదు చేయలేదని

#### 45 వీర్య నమూనాలు స్వాధీనం

కూడా తేలింది. వైద్య వృత్తి చేయడానికి అవసరమైన విద్యార్హతలు లేనప్పటికీ సంబంధిత వ్యక్తులు వీర్య నమూనాలను నిల్వ చేయడం ద్వారా చట్టవిరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారని కూడా దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో విరార్ (తూర్పు)లోని విరార్ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయబడింది. పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# గ్యాస్ సరఫరాపై కలెక్టర్ 'నజర్'

- జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు: కలెక్టర్ ప్రతిమా సింగ్
- అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ చేస్తే జైలుకే.. పటిష్టంగా నిఘా



**ప్రజానావ, మెదక్:** జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనలతో ఈ కమిటీ ఏర్పాటైందని, గ్యాస్ సిలిండర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించినా, బ్లాక్ మార్కెట్ చేసినా నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కమిటీ సభ్యులు వీరే..

కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీలో ఎస్పీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రాంతీయ మేనేజర్లు, ఆర్టీఓ సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, వ్యవసాయ శాఖాధికారి, విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ అధికారులు బాధ్యతలు నిర్వహిస్తారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధి సభ్యునిగా ఉండగా, జిల్లా పౌర సరఫరాల అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

### నిరంతర నిఘా.. రోజువారీ పరిశీలన

డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో నిల్వల పరిస్థితిని ఈ కమిటీ రోజువారీగా పరిశీలిస్తుంది. నిల్వ కేంద్రాలు, పంపిణీ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించడంతో పాటు సిలిండర్ల దారి మళ్లింపును అడ్డుకుంటుంది. అక్రమాలకు పాల్పడితే ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. వినియోగదారుల ప్రయోజనాలే పరమావధిగా కమిటీ తరచుగా సమావేశమై తగిన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.

# మున్సిపల్ సేవలు భేష్

- ప్రాంతీయ సంచాలకులు షాహిద్ మసూద్
- పెద్దపల్లి శానిటేషన్, ట్యాంక్ బండ్ పనులపై ప్రశంసలు
- కమిషనర్ ఆకుల వెంకటేష్ కు అభినందనలు, చైర్మన్ సన్మానం



**ప్రజానావ, పెద్దపల్లి:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పర్యవేక్షణలో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రాంతీయ సంచాలకులు షాహిద్ మసూద్ శనివారం పెద్దపల్లిలో పర్యటించారు. 32వ వార్డులోని పారిశుధ్య పనులు, మినీ ట్యాంక్ బండ్, చందపల్లి నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షాహిద్ మసూద్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ పనులు బాగున్నాయని, ట్యాంక్ బండ్ అద్భుతంగా ఉందని కొనియాడారు. నర్సరీల్లో మొక్కల నిర్వహణ తీరును అభినందించారు. పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.


### అధికారుల పనితీరుపై ప్రశంస

మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పనితీరును షాహిద్ మసూద్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నూగిల్ల మల్లయ్య ప్రాంతీయ సంచాలకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తిర్రి లత రాజు, పెంజర్ల రాకేష్, నాంసాని శ్రీనివాస్, మేనేజర్ లింగయ్య పాల్గొన్నారు. అలాగే అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, అకౌంటెంట్ నాగవేణి, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.

# గ్రీన్ ఛానల్ ద్వారానే వేతనాలు ఇవ్వాలి: సిఐటియు

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరిక



**ప్రజానావ, పెద్దపల్లి:** గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారానే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీల నిధుల ద్వారా వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2వ తేదీన ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిపెల్లి రవీందర్, ఎండి ఖాజా డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

### పీఆర్సీ పరిధిలోకి కార్మికులను తేవాలి

సిబ్బంది అందరినీ 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీఓ నెం.51 సవరణ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు కోరుతూ తీర్మానం చేయాలని విన్నవించారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను తక్షణమే చేర్చాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల వేధింపులు, కార్మికుల తొలగింపులపై చర్యలు చేపట్టాలని, బకాయి వేతనాలను వెంటనే విడుదల చేస్తూ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఆందోళన బాట పడతాం

సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య, రెడ్డిమల్ల నగేష్, సహాయ కార్యదర్శి జంగపల్లి నరేష్, తీట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు దేవయ్య, ప్రేమ్ కుమార్, చిరంజీవి, నరసయ్య తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# ఆరో రోజుకు చేరిన అఖండ శివనామ సప్త

తన బరువుకు సమానమైన 91 కిలోల చక్కెరను అందజేసిన బాబు పటేల్

భక్తి పారవశ్యంలో గ్రామం.. సోమవారం మహా అన్నదానం

**ప్రజానావ, మద్నూర్:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లార గ్రామంలో అఖండ శివనామ సప్త ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరుస్తోంది. ఆరవ రోజు ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. దానే మారుతి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. కౌలాస్ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తి మార్గంలో శాంతియుతంగా ఉంటే దేవుని దయతో కుటుంబాలు అభివృద్ధి పథంలో సాగుతాయని భక్తులకు సూచించారు.

### బరువుకు సమానంగా విరాళం

మాజీ మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ బాబు పటేల్ వినూత్నంగా తన బరువుకు తగ్గట్టుగా 91 కిలోల చక్కెరను విరాళంగా అందజేశారు. ప్రతిరోజు భజనలు, కీర్తనలు, అన్నదానాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. సోమవారం నాడు గ్రామం మొత్తానికి మహా అన్నదానం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. భక్తి మార్గమే సన్మార్గమని, అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు.

# మానవత్వం చాటుకున్న పద్మదేవేందర్ రెడ్డి

రోడ్డుపై ఫిట్స్‌తో పడిపోయిన వ్యక్తికి ఆపన్నహస్తం

కారు ఆపి బాధితుడిని కాపాడిన మాజీ డిప్యూటీ స్పీకర్



**ప్రజానావ, మెదక్:**

మాజీ డిప్యూటీ స్పీకర్, భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షురాలు పద్మదేవేందర్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. శనివారం రామాయంపేట పెద్దమ్మ జాతర ఉత్సవాలలో పాల్గొని హైదరాబాద్‌కు వెళ్తుండగా శంకరంపేట్ మండలం టీ మందాపూర్ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. దీనిని గమనించిన పద్మదేవేందర్ రెడ్డి వెంటనే కారు ఆపి ఆ వ్యక్తి వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. తక్షణమే అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని బాధితుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో పద్మదేవేందర్ రెడ్డి చూపిన చొరవకు అక్కడున్న పలువురు అభినందనలు తెలిపారు.

# రామాయంపేటలో 'గ్యాస్' దారిమళ్లింపు

పానీపూరి బండ్ల నుంచి హోటళ్ల వరకు డొమెస్టిక్ సిలిండర్ల వాడకం

తనిఖీల్లో 6 సిలిండర్లు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

అక్రమంగా వాడితే జైలుకేనని తహసీల్దార్ రజనీకుమారి హెచ్చరిక



**ప్రజానావ, రామాయంపేట:** రామాయంపేట పట్టణంలో గృహ అవసరాలకు కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య పనులకు వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పానీపూరి బండ్లు, మిర్చి బండ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా వీటిని వాడుతున్నారు. తక్కువ ధరలో లభించే డొమెస్టిక్ సిలిండర్లనే వ్యాపారులు వాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ సరఫరాపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే గ్యాస్ ఇలా దుర్వినియోగం కావడం వల్ల సామాన్య వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### ఏజెన్సీలకు తహసీల్దార్ హెచ్చరిక

పట్టణంలోని హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ నుంచి ఈ సిలిండర్లు వ్యాపారుల చేతుల్లోకి ఎలా వెళ్తున్నాయనే ప్రశ్నలు వస్తున్నాయి. తహసీల్దార్ రజనీకుమారి ఏజెన్సీని తనిఖీ చేసి డొమెస్టిక్ గ్యాస్ ను వ్యాపారులకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. శనివారం రెవెన్యూ అధికారులు పలు హోటళ్లు, దాబాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. దామరచెరువు శివారులోని హర్యానా దాబాలో 3, నందిని హోటల్‌లో 1, సిద్దిపేట చౌరస్తాలోని హోటల్‌లో 2 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

### చర్యలు తప్పవన్న అధికారులు

సబ్సిడీ గ్యాస్ ను వాణిజ్య అవసరాలకు వాడటం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. అక్రమాలు కొనసాగితే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుర్వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# కొల్చారం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. తండ్రి, కొడుకు సహా ముగ్గురు మృతి

- శుభకార్యం ముగించుకుని వస్తుండగా విషాదం.. ఆర్టీసీ బస్సు ఢీకొని దుర్మరణం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**ప్రజానావ, మెదక్/కొల్చారం:** మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను హవేలీఘనపూర్ మండలం బూర్గుపల్లికి చెందిన అమృత్ గౌడ్ (51), అతని కుమారుడు రిషివర్ధన్ గౌడ్ (13), భూపాతిపూర్‌కు చెందిన సాయి గౌడ్ (35)గా పోలీసులు గుర్తించారు. వీరు రంగంపేట్‌లో జరిగిన బంధువుల ఇంటి తొట్టెల కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

### ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విషాదం

మెదక్ఉహైదరాబాద్ 765 డి జాతీయ రహదారిపై రాంపూర్ శివారులో మెదక్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం చాలా తీవ్రంగా ఉండటంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.



### బూర్గుపల్లిలో మిన్నంటిన రోదనలు

ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకుతో పాటు అల్లుడు మరణించడంతో బూర్గుపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్ఐ మొహమ్మద్ మోహినుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలంలో సర్పంచ్ సంగమేశ్వర్, ఉపసర్పంచ్ శ్రీశైలం, మాజీ విద్యా కమిటీ చైర్మన్ పోచయ్య ఉండి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించడంలో సాయపడ్డారు.

